
# యాత్ర

## -అధికారి వేణుగోపాలరావు

"ధర్మస్థల చేరేటప్పటికి ఎంతసేపవు తుంది?" అడిగాను. "ఊట సమయక్కు సేరితివి" (భోజన సమయానికి చేరతాము) అన్నాడు మంజునాథ్. ఆ టూరిస్టు కేబ్‌లో నలుగురం స్నేహి తులము మరో స్నేహితుని పెళ్ళికి ఉడిపి బయలు దేరాము. మేమంతా బెంగుళూరు లోని ఒక ఫ్యాక్టరీ లో ఫర్నెసు ఇంజనీర్లము. నేను తప్ప మిగిలిన వారం దరూ కన్నడపు వారే. చిత్ర దుర్గలో పుట్టి పెరిగిన మంజునాథ్‌కు తెలుగు బాగా వచ్చు. మిగిలిన వారు మాత్రం అర్థం చేసుకోగలరు. కొంచెం కొంచెం మాట్లాడతారు... నా పరిస్థితీ అంతే. కన్నడంలో తెలు గును కలిపి మాట్లాడ గలను. అందువలన మా సంభాషణ ప్రాం తీయ భాషల, రాష్ట్ర, అంతర్ రాష్ట్రీయ భాషల కలగూర గంపలా ఉంటుంది.

పెళ్ళికి ముందు రోజు బయలుదేరి ధర్మస్థలలో ఆ రాత్రి బస చేసి, తరువాత రోజు పెళ్ళికి ఉడిపి వెళ్ళాలన్నది మా ఆలోచన. వెళుతూ చిక్క మంగళూరు కాఫీ ఎస్టేట్సు, ఛార్మడీ కొండలు, ధర్మస్థల ఉడిపి, చూసి తిరిగి వస్తూ మల్పేబీచ్, ఆగుంచే కొండలు మీదుగా రావాలన్నది మా ప్రణాళిక. కారు ఛార్మడీ కొండల మీదుగా ప్రయాణం చేస్తుంటే ఊపిరి బిగ్గపట్టుకుని కూర్చున్నాముఇ. ఎత్తయిన కొండల అంచుల గుండా ప్రయాణం, ఒక వైపు మీద పడతాయేమోననిపించే కొండ చరియలు, మరో వైపు కిలో మీటరు లోతున్నలోయ. అలాంటి రోడ్డుపై ఒక కొండ నుండి మరో కొండకు ప్రయాణం చెయ్యటం ఓ మధుర స్మృతి.




ఊహించినట్టుగనే ఆలయంవారి ఉచిత భోజనం చేసి, వారిచ్చిన సత్రం గదిలో విశ్రాంతి తీసుకున్నాము. ఆ భోజనం మామూలు భోజనం కాదు. నూనె, కారం లేకుండా వండినది. విశేషించి ఆ సాంబారును ఎలా చేస్తారో. తెలియదుగాని, అద్భుతమనవచ్చు. అలాగే సత్రం అంటే ఆషామాషీ కాదు, స్టార్ హోటల్‌లను తలపించే వసతులున్న సత్రం అది. సాయంత్రం వింటేజ్ కార్ల మ్యూజియం, పురాతన వస్తుశాల చూసాము.

సుమారు ముప్పయి అడుగుల ఎత్తున్న బాహుబలుని దర్శించాము. రాత్రి ఏడు గంటల సమయానికి ప్రారంభమయ్యే పూజలో చేరి మంజునాథ స్వామిని దర్శించాము. ఇక్కడి మరో వింత ఆచారము, చొక్కాలు తీసివేసి స్వామి దర్శనం చేసుకోవటం.

భారతదేశంలో అత్యంత సుందర ప్రదేశాలున్న రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి. దూరదృష్టి గల మైసూరు మహారాజులు, వారికి దిశానిర్దేశం చేసిన మోక్ష గుండం విశ్వేశ్వరయ్యలు లభించటం వీరి అదృష్టం. అత్యంత పురాతన సంప్రదాయాలు, అత్యంత నవీన సంస్కృతులు కలిసి ఉంటాయి ఇక్కడ. మఠాలు, స్వామీజీలు, ఆధునిక గురువులు కోకొల్లలు. వీరంతా, వారి వారి ప్రాంతాలను, అభివృద్ధి చేసినవారే. అలాంటి ఒక గురువుల కుటుంబపు చేతిలో పడి విశిష్టమైన పుణ్యక్షేత్రంగా మారింది ధర్మస్థళ. ఇక్కడి విశిష్టతకు మరో కారణం మత సహనం. ఎలా అంటే ధర్మస్థల దైవము - మంజునాథ - అంటే పరమశివుడు. అర్చకులు శ్రీ వైష్ణవులు, ధర్మకర్తలు - హెగ్డేలు - అంటే జైనులు.

ఉదయాన్నే బయలుదేరి ఉడిపి చేరాము. పెళ్ళిలో పరిచయమయ్యాడో వ్యక్తి. సన్నగా, పొడుగ్గా, పాత సినిమాల్లోని రమణా రెడ్డిలా ఉన్న శంకరప్ప. అతని వాలకం, మాటలు, ముఖ్యంగా అతని బాడీ లాంగ్వేజ్, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఉంది. చూస్తూనే చిన్ననాటి శత్రువును చూస్తున్నట్టనిపించింది. నా ఆప్త మిత్రుడైన మంజునాథ్ "శంకరప్ప, ఎక్స్‌పర్ట్ గేస్ కట్టర్" అంటూ నాకు పరిచయం చేశాడు. నేను పరిచయం చేసుకుంటుండగానే "ఏమిటి మీ పి.వి. నరసింహారావు గారు ఊచలు లెక్కబెడుతున్నారట కదా" అన్నాడు. 'పుల్లవిరిచి' మాట్లాడే ఆ శంకరప్పకు దూరంగా జరుగుతూ మంజునాథ్‌తో "హి ఈజ్ హైలీ సర్కాస్టిక్" అన్నాను మరికొద్ది సేపు అతన్ని దూరం నుండి గమనిస్తూ 'దెయ్యం దూత' అని మారు పేరు పెట్టాను. మంజునాథ్ మాత్రం అతని మనః తత్వం బాగా తెలిసిన వాడిలా "మాతు కఠిన ఆదరే మనసు చెన్న" (మాట కఠినం, కాని మనసు వెన్న) అన్నాడు.

పెళ్ళిలో కూర్చుని దక్షిణ కెనరా జిల్లా పెళ్ళి సంప్రదాయాలను గమనిస్తూ, అర్థం కాని వాటిని గూర్చి మంజునాథ్‌తో చర్చిస్తూ గడిపాను. సాధారణంగా పెళ్ళి ముహూర్తం అంటే ఒక నిర్ణీత క్షణానికి తాళికట్టడము అనే అభిప్రాయంలో ఉన్న నేను ముహూర్తం అరగంటపైగా ఉండటంతో మంజునాథ్‌ను ప్రశ్నించాను. "తాళి కట్టడానికి మీరిచ్చినంత ప్రాముఖ్యత మేమివ్వము. ఆ అరగంట సమయంలో ఎప్పుడైనా కట్ట వచ్చు మిగిలిన తతంగం అంతా పూర్తి చేసుకుని చివరి నిమిషంలో మేం తాళి కడతాము" అంటూ వివరించాడు.

వధూ వరులను పలుకరించి, భోజనాలలో కూర్చున్నాము. ఎక్కడి నుండి ఊడి పడ్డాడో తెలియదుగాని, సరిగ్గా మా ఎదురుగా కూర్చున్నాడు 'దెయ్యందూత.' వడ్డన తీపితో ప్రారంభించారు. తరువాత "ఫ్రైస్" తరువాత అన్నం, సాంబారు. తరువాత "చికోటి" అనే తీపి. ఇది పూరీలా ఉంది. దీనిని ఒక ప్లేటులో ఉంచి, దానిపై పంచదార పొడిచల్లి, నిండుగా పాలుపోసారు. దానిని కొంతసేపు నానపెట్టి, ముద్ద చేసి తినాలన్న మంజునాథ్ సూచనల ప్రకారం తిన్నాను. చాలా బాగుంది. అన్నం, రసం వేసారు. తరువాత పెరుగన్నం. తింటున్నంతసేపూ దెయ్యం దూత తన ధోరణిలో ఏమేమో మాట్లాడుతునే ఉన్నాడు. మంజునాథ్ కాస్త మాట్లాడుతున్నా, నేను మాత్రం పెరుగన్నం గబగబా తినేసి లేచాను. మంజునాథ్ నవ్వుతూ కూర్చోబెట్టాడు. ఆశ్చర్యపోతూ చూస్తుంటే రకరకాలైన పదార్థాలు వస్తూనే ఉన్నవి. ఏమీ వద్దన్నట్టు చేతులు అడ్డంగా ఉంచాను. ఇంతలో జాంగ్రీ లాంటి ఓ స్వీటు వేస్తున్నారు. నేను వద్దన్నాను. "సాహెబురే! తుంబ చెన్నాగిరుత్తే" అంటూ బలవంతంగా నాకు వేయించాడు దెయ్యం దూత! తిన్నాను. చాలా బాగుంది. "ఇదర హెసరేనుగొత్తా" (దీని పేరు తెలుసా?) అడిగాడు దెయ్యం దూత. "తెలియదన్నాడు మంజునాథ్. ఆ పేరు చెబుతాడని ఎదురు చూస్తున్నాము మేము. పిచ్చి వానిలా గొల్లున నవ్వుతూ "నన గూ గొత్తిల్ల" (నాకూ తెలియదు) అన్న దెయ్యందూతను చూసి చిర్రెత్తు కొచ్చింది. భోజనం చేస్తున్నామన్న సంగతిని కూడా మరచిపోయి, నాకు తెలిసిన కన్నడకు తెలుగు, హిందీ, ఇంగ్లీషులను కలిపి చెడామడా తిట్టాను. చివరిగా "మేనర్స్ లెస్ ఇడియట్" అంటూ తిట్ల పురాణాన్ని ఆపాను. కొంత సేపటి వరకూ నిశ్శబ్దంగా ఉన్న దెయ్యందూత, ఏమీ జరగనట్టు తన ధోరణిలో మాట్లాడుతుండటంతో, మంజునాథ్ చేయి పట్టుకుని మరో చోటుకు లాక్కెళ్లాను."

"ఆగుంటే" కొండల మీదుగా తిరుగు ప్రయాణం ప్రారంభించాము. సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం మైసూరుపులి టిప్పు సుల్తాన్ వేయించాడని చెప్పబడుతున్న రోడ్డుపై మా ప్రయాణం సాగుతోంది. "ఛార్మడీ" కొండల కన్నా ఎత్తయినవీ, సుందరమైనవీ, ప్రమాదకరమైనవి ఈ ఆగుంటే కొండలు. ఆకాశాన్ని తాకుతున్నట్టుండే కొండలు ఒకవైపు, వాటితో పోటీ పడుతూ పెరిగిన దశాబ్దాల శతాబ్దాల నాటి చెట్లు మరోవైపు. వీటి ఆప్యాయతకు పరవశించిన మేఘాలు వర్షాకాలం కాకున్నా కూడా సన్నని జల్లులు కురిపిస్తాయి. దీనితో ఆదారంతా చెమ్మగా ఉంటూ ప్రయాణాన్ని మరింత కఠినం చేస్తుంది. ప్రతి హెయిర్ పిన్ బెండ్ వద్దా "కొండ ఎక్కే వాహనాలకు ప్రాధాన్యత నివ్వండి" అనే సూచన ఉన్నా, మాకు ఎదురుగా వస్తున్న లారీలు ఆ సూచనను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. "సన్ సెట్ పాయింటు" వద్ద కారు నిలిపాడు డ్రైవరు. సూరీడు, భూమాత ఒడిలో ఒరిగిపోవటాన్ని ఏదో దివ్య స్వప్నం చూస్తున్నట్టుగా నిశ్చలంగా నిలబడిపోయాం. వెలుతురు ఉన్నప్పుడే కొండలను దాటాలని డ్రైవరు, బయలు దేరదీసాడు. కాసేపటికి వేగంగా వస్తున్న లారీని తప్పించడానికి కాస్త ప్రక్కకు జరిగిన మా కారు పల్టీ కొట్టి, లోయలో రెండు పెద్ద చెట్ల మధ్యన చిక్కుకుంది. మా అందరికీ ప్రమాదం తప్పింది.

ఎంతసేపలా పడి ఉన్నామో తెలియదు. ఏదో శబ్దం నన్ను లేపింది. బాగా పరిచయమైన వాసన, శబ్దం, అయినా గుర్తు తెచ్చుకోలేక పోతున్నాను. చాలా కష్టపడి చూద్దామని ప్రయత్నించినా కళ్ళు సహకరించలేదు. అప్పుడు అసటలీన్ వాసనను గుర్తు పట్టాను. ఎవరో ఆక్సీ - అసటలీన్ కట్టరుతో కారును కోస్తున్నారు. కటింగ్ ఆపి, తలుపును లాగి, నా ముఖం పై ముఖం పెట్టి చూస్తున్నాడు దెయ్యం దూత. "సాహెబురే! బన్ని! రండి" అంటూ నన్ను జాగ్రత్తగా ఎత్తుకుని తీసుకువెళ్ళాడు. అతి కష్టం మీద అడిగాను "ఎలా వచ్చావని" "మీరే అన్నారు కదా! దెయ్యం దూతని! గాలిలో తేలుతూ వచ్చాను." మరల చెప్పాడు "సూర్యాస్తమయం చూస్తున్న నాకు మీ కారు పల్టీ కొట్టడం కనిపించింది. మిమ్మల్ని బయటకు తియ్యటం సాధ్యం కాక, వెనక్కు వెళ్ళి, గేస్ కట్టరు తెచ్చి కారును కోసాను." పూర్తిగా కోలుకున్న నేను అతని చేతులు పట్టుకుని "నిజంగా నువ్వు దూతవే! నేనన్నట్టు దెయ్యం దూత కావు! మా ప్రాణాలు కాపాడిన దేవ దూతవు!" అంటూ నా కృతజ్ఞతలు తెలిపాను.